సాక్షి తిరుపతి

సోమవారం ౹ 2 ౹ డిసెంబర్ ౹ 2024



ఏటీఎం ధ్వంసంపై ఫిర్యాదు

చంద్రగిరి కొత్తపేటలోని ఇండియన్ బ్యాంకు ఏటీఎంను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. - 8లో



మోటార్లకు 'మీటర్లు'

స్మార్ట్ మీటర్లతో రైతులను నిలువునా మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం పకడ్బందీగా కార్యాచరణ అమలు చేస్తోంది. - 8లో



గ్రామీణులు గజగజ

భాకరాపేట మండలంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. - 8లో



శ్రీకాళహస్తిలో ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

వదలని వర్షం

ఫెంగల్ తుపాను జిల్లాను అతలాకుతలం చేస్తోంది. మూడు రోజుల నుంచి వదలకుండా వర్షం కురుస్తోంది. ఈదురుగాలులతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. దీంతో జనజీవనం దాదాపు స్తంభించింది. పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో కొన్ని చోట్ల కరెంట్ సరఫరా నిలిచిపోయింది. నదులు.. వాగులు.. వంకల ఉధృత ప్రవాహం పరీవాహక ప్రాంతాలను వణికిస్తోంది. పంట పొలాలు నీట మునగడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అధికార యంత్రాంగం సకాలంలో స్పందించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతోంది. ఈ క్రమంలోనే జలాశయాలు.. చెరువులకు భారీగా వరద నీరు చేరుతుండడం కొంతలో కొంత ఉపశమనమని వెల్లడిస్తోంది.

ముంచెత్తిన ఫెంగల్ తుపాను

- వణికిస్తున్న ఈదురుగాలులు
- ఉప్పొంగుతున్న నదులు..వాగులు.. వంకలు
- ఛిద్రమైన రహదారులు.. విరిగిన స్తంభాలు
- పలు ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు
- నీటమునిగిన పంటలు



డీవీ సత్రం మండలంలో ముంపునకు గురైన ఉచ్చూరు



శ్రీకాళహస్తి : వాగు దాటుతున్న అత్తూరు వాసులు



సత్యవేడు : ఉధృతంగా గొడ్డేరు వాగు



చిల్లకూరు : తీగపాలెం తీరంలో ఎగసిపడుతున్న అలలు

కల్యాణి డ్యామ్‌కు వరద



కల్యాణి డ్యామ్‌లో నీరు

చంద్రగిరి : తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు కల్యాణి డ్యామ్‌కు వరద నీరు చేరుతోంది. పది రోజుల క్రితం డ్యామ్‌లో స్టోరేజీ పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో శేషాచల అడవుల నుంచి భారీగా వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం 841 అడుగుల నీటి మట్టం ఉండగా, ఆదివారం రాత్రికి 847 అడుగుల మేరకు పెరిగినట్లు వెల్లడించారు. 898.50 అడుగులకు నీరు చేరితే గేట్లు ఎత్తేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఫెంగల్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు, వరవ కాలువల ద్వారా చెరువులు, రిజర్వాయర్లకు నీరు చేరుతోంది. ఈ క్రమంలోనే కొన్ని చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. కాజ్‌వేలపై నుంచి వరద నీరు ఉప్పొంగడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. పెనుగాలులకు పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రాకపోకలు బంద్

- పెళ్లకూరు మండలం కొత్తూరు సమీపంలో కొర్రవాడి చెరువుకు గండి పడడంతో ఆయకట్టు పరిధిలోని వరి పంట నీటమునిగింది. అలాగే రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.
- కాళంగి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో పూడి సీకేపురంతోపాటు, ఎగువ పూడి, మధ్య పూడికిరాకపోకలు ఆగిపోయాయి.
- కాళంగి రిజర్వాయర్ అవుట్ ఫ్లో కారణంగా పాముల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సూళ్లూరుపేట మండలంలోని పలు పల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- నాయుడుపేట మండలంలో మామిడి కాలువ, తడ మండలంలో కర్వేటికాలువ, శ్రీకాళహస్తి మండలంలో ఈదులకాలువ, సున్నపు కాలువ, గూడూరు మండలంలో కైవల్యానది, ఉప్పుటేరు వెంకటగిరి మండలంలో కైవల్యా నది ప్రవాహంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు.
- వరదయ్యపాళెం మండలంలో మారేడు కాలువ ఉధృతి కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే శ్రీకాళహస్తి-సూళ్లూరుపేట మార్గంలో కొన్నంబట్టు సమీపంలోని కల్వర్ట్ దెబ్బతింది.
- ఏర్పేడు మండలంలోని పాపానాయుడు పేట నుంచి గుడిమల్లానికి వెళ్లే మార్గంలో సీత కాలువ ప్రవాహంతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.
- శ్రీకాళహస్తి, నాయుడుపేట ప్రాంతాల్లో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- తిరుమలలోని ఐదు జలాశయాలకు వర్షపు నీరు పోటెత్తుతోంది. గోగర్భం డ్యామ్ పూర్తిగా నిండిపోవడంతో ఆదివారం సాయంత్రం గేట్లు గంటసేపు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు.

నిలిచిన బస్సులు

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 116 ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు నిలిపేశారు. ప్రస్తుతం జిల్లాలో 802 సర్వీసులకు గాను 686 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో ఆర్టీసీ రాబడి సైతం తగ్గింది.

ప్రాణాల మీదకు తెస్తున్న కల్వర్టు



మృతి చెందిన రమేష్

కేవీబీపురం (వరదయ్యపాళెం):భారీ వర్షాలు కురిస్తే కేవీబీపురం మండలంలోని పూడి సీకేపురం కల్వర్టు కొట్టుకుపోతుంది. ఏటా ఇది క్రమం తప్పకుండా జరుగుతోంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో శాశ్వత నిర్మాణం చేపట్టకపోవడంతోనే అసలు సమస్య వస్తోంది. కొట్టుకుపోయిన ప్రతి పర్యాయం తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. కాంట్రాక్టర్లు మాత్రం మొక్కుబడిగా పనులు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

పాత కథే పునరావృతం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పూడి సీకేపురం కల్వర్టు పాత కథే పునరావృతమైంది. కల్వర్టు కొట్టుకుపోవడంతో 5 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వైద్యం అందక వ్యక్తి మృతి

కల్వర్టు కొట్టుకుపోవడంతో సకాలంలో వైద్యమందక ఓ పశువుల కాపరి మృతి చెందాడు. వివరాలు.. నక్కలకోన రమేష్ శుక్రవారం మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. అయితే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి. కల్వర్టు కొట్టుకుపోవడంతో నీటి ప్రవాహం కారణంగా కాజ్‌వేను దాటలేని దుస్థితి దాపురించింది. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కుటుంబీకులు, గ్రామస్తులు చూస్తుండగానే రమేష్ కన్నుమూశాడు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

స్వర్ణమ్మ పరవళ్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కల్యాణిడ్యాం, మల్లెమడుగులో నీరు స్వర్ణముఖి నదిలో కలుస్తుండడంతో నది ఉధృతి పెరిగింది. ఆదివారం వర్షం కురిస్తే ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది.

మునిగిన పంటలు



కోట : వెంకన్నపాళెంలో నీట మునిగిన వరి నాట్లు

ప్రస్తుత రబీ సీజన్‌లో అధికంగా వరి పంట సాగులో ఉంది. వదలని వాన కారణంగా పలు ప్రాంతాల్లో పంట నీట మునిగింది. ఇలాగే మరో రెండు రోజులపాటు వర్షం కొనసాగితే రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదముంది.

అరణియార్ నుంచి నీటి విడుదల

నాగలాపురం : పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టు నీటిమట్టం 27 అడుగులు దాటింది. దీంతో ఆదివారం ఇరిగేషన్ డీఈ రామచంద్ర ఆధ్వర్యంలో గేట్లు తెరిచి నీరు విడుదల చేశారు. డీఈ మాట్లాడుతూ ప్రాజెక్టుకు 2,500 క్యూసెక్కుల వరద రావడంతో 500 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు వెల్లడించారు.



కేవీబీపురం మండలం వగతూరు ఎస్టీకాలనీ రోడ్డు దుస్థితి



ఏర్పేడు మండలం పాపానాయుడుపేట- చెన్నంపల్లె మార్గంలో నక్కలవాగు ఉధృతి



వెంకటగిరిలో ఉప్పొంగుతున్న బంగారుపేట చెరువు



తిరుమలలోని గోగర్భం డ్యామ్ నిండడంతో నీరు విడుదల చేసిన అధికారులు

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనం.. స్థానికులకు ప్రత్యేకం

తిరుమల : శ్రీవారి దర్శనం చేసుకునేందుకు స్థానికులకు ప్రత్యేక అవకాశం కల్పించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం వైకుంఠనాథుని సేవించుకునే వెసులుబాటు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే ఇందుకోసం టీటీడీ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది.

- తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 2,500 టోకెన్లు, తిరుమలలోని బాలాజీ నగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో 500 టోకెన్లు జారీ చేస్తారు.
- వేకువజామున 3 నుంచి 5 గంటల మధ్య ముందుగా వచ్చిన వారికి తొలి ప్రాధాన్యమిస్తూ టోకెన్లు కేటాయిస్తారు.
- టోకెన్ పొందడానికి స్థానికులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలి.
- దర్శన సమయంలో సైతం ఒరిజినల్ ఆధార్ కార్డును తెచ్చుకోవాలి.
- వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఫుట్‌పాత్ హాల్ (దివ్య దర్శనం) క్యూలైన్‌లో స్థానికులనుఉ దర్శనానికి అనుమతిస్తారు.
- దర్శనానంతరం ఒక లడ్డూను ఉచితంగా అందిస్తారు.
- స్థానికుల కోటాలో దర్శనం చేసుకున్న వారిని తిరిగి 90 రోజుల వరకు శ్రీవారి దర్శనానికి అనుమతించరు.

అట్టహాసంగా 'మహాసభ'



దప్పు కొట్టి ర్యాలీ ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సత్యవేడు : సీపీఎం జిల్లా 14వ మహాసభ ఆదివారం సత్యవేడులో ప్రారంభమైంది. భారీ వర్షంలో సైతం పెద్దసంఖ్యలో కామ్రేడ్లు హాజరయ్యారు. ప్రజానాట్యమండలి కళాకారులు డప్పు వాయించగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్ ఉద్యమ పాటలతో అగ్రనేతలకు స్వాగతం పలికారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎర్ర జెండా ఊపి, డప్పు కొట్టి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూల రమేష్, ఎం.భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సత్యవేడు కార్యదర్శి ఎం. రమేష్ , పి.సాయిలక్ష్మి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు దారుణం



నిరసన తెలుపుతున్న ఐహెచ్‌ఆర్‌పీసీ సభ్యులు

తిరుపతి సిటీ : సభ్య సమాజం తలదించుకునేలా మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు దారుణమని, ప్రభుత్వాలు కట్టడి చేయకుంటే పోరాటం తప్పదని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ (ఐహెచ్‌ఆర్‌పీసీ) హెచ్చరించింది. ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఐహెచ్‌ఆర్‌పీసీ రాయలసీమ జోనల్ సమావేశం నిర్వహించారు. ఐహెచ్‌ఆర్‌పీసీ ఫౌండర్, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ముజాహిద్, చైర్మన్ డాక్టర్ సోహెబ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిత్యం వందల మంది మహిళలు వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ ఏడీ బిల్డింగ్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రశాంతి, శోభారాణి, కిరీటిరెడ్డి, బాలకృష్ణ, సునీల్, అరుణ్, రవి, మహేష్, మణికంత, బాలసుబ్రమణ్యం, గిరీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పట్టాభిరామునిగా పద్మావతీదేవి

- కనులపండువగా 'హనుమ' సేవ
- కల్పవృక్ష వాహనంపై విహరించిన సిరులతల్లి



కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో ఊరేగుతున్న అలమేలు మంగమ్మ



హనుమంత వాహనంపై పట్టాభిరాముని అలంకరణలో కొలువుదీరిన ఆకాశరాజు పుత్రిక

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి 8గంటలకు అమ్మవారు హనుమంత వాహనంపై పట్టాభిరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించా. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఉదయం 4గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అద్దాలమండపం నుంచి వేంచేపుగా వాహనమండపానికి తీసుకొచ్చి ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. రాజమన్నార్ అలంకరణలో చర్నాకోలు, దండం ధరించిన పద్మావతీదేవి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తుల గోవింద నామ స్మరణ నడుమ కనులపండువగా ఊరేగింపు సాగింది. మధ్యాహ్నం అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిపించారు. రాత్రి హనుమంత వాహనంపై అమ్మవారు విహరించారు. సేవల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజు, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

నేడు పద్మశాలీల పట్టువస్త్రాలు

అమ్మవారికి గజ వాహన సేవ సందర్భంగా పద్మశాలీలు పట్టువస్త్రాలు, పుట్టింటి సారె సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను ఆలయ అధికారులకు అందజేయనున్నారు.

నేడు 'కాసుల హారం' శోభాయాత్ర

చంద్రగిరి/తిరుమల : పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు సోమవారం రాత్రి అమ్మవారు గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీ కాసుల హారాన్ని గజ వాహనంపై కొలువుదీరిన అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం తిరుమల నుంచి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని శోభాయాత్రగా తీసుకువచ్చి ఆలయ అధికారులు, అర్చకులకు అందజేయనున్నారు. ఈ క్రమంలోనే గజవాహన సేవ అనంతరం సిరులతల్లికి వసంతోత్సవం నిర్వహించనున్నారు.

గురుకులంలో ఆకలి కేకలు



మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భోజనం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్న భోజనం ఆలస్యంగా పెట్టడంపై తహసీల్దార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం వెంటనే గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆలస్యంగా భోజనం వడ్డించడంపై ప్రిన్సిపల్, వార్డెన్‌ను ప్రశ్నించారు. ప్రిన్సిపల్ ధర్మేంద్రసింగ్ మాట్లాడుతూ.. భోజనం ఆలస్యంగా పెట్టడం వాస్తవమే అన్నారు. అదే సమయానికి బియ్యం లోడు రావడంతో వంట మనుషులే కూలీలుగా మారి బస్తాలను దించుకుని, తర్వాత భోజనం తయారు చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. బియ్యం బస్తాలను అన్‌లోడ్ చేసేందుకు కూలీలు రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు. మరో పర్యాయం ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నల్లయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా


6 నుంచి 'ఆకేపాటి' మహాపాదయాత్ర

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి దర్శనానికి 22వ మహాపాయాత్రను ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆదివారం తెలిపారు. రాజంపేట మండలం ఆకేపాడు నవోదయ కాలనీలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. గోవింద మాల ధరించిన వేలాది మంది భక్తులతో కలిసి బయలుదేరుతున్నట్లు చెప్పారు. రాత్రి రాజంపేట అశోక గార్డెన్స్‌లో బస చేస్తామని, 7వ తేదీ రాత్రి కోడూరులోని అనంతరాజుపేట హార్టికల్చర్ కాలేజీలో, 8వ తేదీ రాత్రికి రేణిగుంట మండలం కుక్కలదొడ్డిలోని కేశవరెడ్డి స్కూల్‌లో బస చేయనున్నట్లు వివరించారు. 9వ తేదీన అన్నమయ్య కాలి బాట మార్గంలో తిరుమలకు చేరుకుంటామని వెల్లడించారు.

తిరుపతి-ముంబయికి విమానం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : తిరుపతి నుంచి ముంబయికి నేరుగా ఇండిగో విమానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రయాణికులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మన్నె శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి-ముంబయి విమాన సదుపాయంతో ఎయిర్‌పోర్టుకు నూతన అధ్యాయం మొదలైందని వెల్లడించారు. ఈ విమానం ముంబయిలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి, 07.15 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని, మళ్లీ ఇక్కడ 7.45కి బయలుదేరి 9.25 గంటలకు ముంబయికి వెళుతుందని వివరించారు. ప్రతిరోజూ ఈ సర్వీసు ఉంటుందని తెలిపారు.





మోటార్లకు మీటర్లు

సీఎం హోదాలో చంద్రబాబు ఏనాడూ రైతులకు మేలు చేయలేదు. అండగా నిలబడలేదు సరికదా అసలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. వ్యవసాయం దండగ అంటూ క్రాప్ హాలిడే ప్రకటించిన ఘనత చంద్రబాబుదే. ఇంతేనా.. పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరిన రైతులను గుర్రాలతో తొక్కించిన చరిత్ర ఆయనదే. వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఉచిత విద్యుత్‌కు మంగళం పాడిన మహానుభావుడు బాబే. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ ఇస్తామని చెప్పిన టీడీపీ అధినేత అధికారంలోకి వచ్చిన దాన్ని అటకెక్కించారు. స్మార్ట్ మీటర్లతో రైతులకు ఇబ్బందులు తప్పవని, మీటర్లు ఏర్పాట్లు చేస్తే పగలగొట్టండి అని చెప్పిన ఆయన ఇప్పుడు అదే పని గుట్టుచప్పుడు కాకుండా అమలు చేస్తున్నారు.

- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో ఏర్పాటు
- త్వరలో ఇళ్లకు, ఆపై వ్యవసాయ మోటార్లకు
- గతంలో స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవన్న చంద్రబాబు
- ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా అమలు

పలమనేరు: ఉచితంగా విద్యుత్ ఇచ్చేదిలేదంటూ హైదరాబాద్‌లో రైతులపై బాష్పవాయువు ప్రయోగించి కర్షకులనే కనికరం లేకుండా వారిని గుర్రాలతో తొక్కించి నలుగురు రైతుల మరణానికి కారణమయ్యారు నాడు చంద్రబాబు. ఉచిత కరెంట్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనంటూ హేళన చేశారు. కాని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఆయన స్ఫూర్తితో మొదలైన ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరాటకంగా కొనసాగిస్తూ రైతులకు కరెంట్ కష్టాలనే మాట లేకుండా చేశారు. ఇదే సమయంలో స్మార్ట్‌మీటర్ల వ్యవహారం రావడంతో దీనిపై చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికలప్పుడు కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లిలో బాదుడేబాదుడు కార్యక్రమాన్ని వచ్చిన ఆయన స్మార్ట్‌మీటర్లతో రైతులకు ఉరితాడు తప్పదని గంటపాటు ప్రసంగించారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చేసరికి స్మార్ట్‌మీటర్లను గుట్టుచప్పుడు కాకుండా అమర్చుతున్నారు.

పలమనేరు డివిజన్‌లో..

ట్రాన్స్‌కో పలమనేరు డివిజన్‌లో ఎల్‌టీ-4(కార్యాలయాలు) మొత్తం 6,530 వరకు ఉన్నాయి. వీటికి స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నారు. ఎల్‌టీ-2లో(వాణిజ్య సముదాయాలు, దుకాణాలు) మొత్తం 19,120 ఉన్నాయి. వీటికి వచ్చే డిసెంబర్‌లోపు స్మార్ట్‌మీటర్లను అమర్చనున్నారు. ఆపై ఎల్‌టీ-3(కుటీర పరిశ్రమలు) మొత్తం 1,452 ఉన్నాయి. వీటికి స్మార్ట్‌మీటర్లను పెట్టనున్నారు. తరువాత ఎల్‌టీ-1లో నివాస గృహాలు 1,68,546, ఎల్‌టీ-5లో 54,995 వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఇప్పటికే అమలు

స్మార్ట్‌మీటర్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటిదాకా ఉన్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నారు. ఇప్పటివరకు ఓ వ్యక్తి వచ్చి మీటర్ రీడింగ్ చూసి కరెంట్ బిల్లులు వేసేవారు. కానీ ఇకపై ఎవరితోనూ పని ఉండదు. స్మార్ట్‌ఫోనుకు ముందుగా ఎలా రీచార్జి చేసుకుంటామో అలాగే కరెంట్ బిల్లును ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.

మీటర్ రీడర్లకు మంగళం

ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది మీటర్ రీడర్లున్నారు. వీరు ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి కరెంట్ రీడింగ్‌ను తీసి, తద్వారా కరెంట్ బిల్లులు అందించేవారు. ఇకపై స్మార్ట్‌మీటర్ల రాకతో వీరి ఉద్యోగాలు పోయినట్టే. దీంతో వీరు సైతం స్మార్ట్‌మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిపై ఆందోళనకు సైతం దిగే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

త్వరలో ఇళ్లు, మోటార్లకు..

స్మార్ట్‌మీటర్లను గృహాలకు ఆపై రైతుల వ్యవసాయ మోటార్లకు వీటిని అమర్చనున్నారు. దీంతో ఇళ్లకు సైతం వినియోగదారులు ముందుగానే ఆన్‌లైన్ ద్వారా కరెంట్ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అదే రీతిలో రైతులు సైతం వారి మోటారు హెచ్‌పీ ఆధారంగా ముందుగానే (ప్రీ పెయిడ్) డబ్బులు వెచ్చించి, రీచార్జి చేసుకోవాలి. కట్టిన డబ్బులు అయిపోగానే ఆటోమెటిక్‌గా విద్యుత్ సరఫరా అవుతుంది.

లబ్ధిదారులకు ఇక ఇక్కట్లే

జిల్లాలోని 75,309 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నారు. జిల్లాలోని 4,163 మంది చేతివృత్తులవారు, ఎంబీసీ తదితరులకు నెలకు 150 యూనిట్ల వరకు గత ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందించింది. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన ద్వారా 1.05 లక్షల ఇళ్ల సర్వీసులు ఇచ్చారు. సర్వీసుకు రూ.3 వేలు కాగా ప్రభుత్వం కేవలం రూ.125కే కరెంట్ సర్వీసు ఇచ్చింది. వీరంతా ఇకపై స్మార్ట్‌మీటర్ల విధానంలో ముందుగానే డబ్బులు కట్టాల్సిందే. దీంతో నిరుపేదలకు సైతం కరెంట్ కష్టాలు తప్పనట్టే.

రైతులకు ఇబ్బందులు తప్పవు



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తప్పవు. రైతు వరి పంట వేసి నీటి తడులు ఇవ్వాల్సిన తరుణంలో కరెంట్ చార్జీ కట్టలేదని కట్ చేస్తే ఆ పంట ఏమి కావాలి. రైతు కష్టం నేల పాలు కావాల్సిందేనా. గతంలో స్మార్ట్‌మీటర్లు వద్దన్న చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే వాటిని ఎలా అమలు చేస్తున్నారు?

– సుబ్బన్న, కల్లాడు, పలమనేరు మండలం

దుకాణదారులకు ఇబ్బందే



మొబైల్ ఫోన్‌కు మాదిరిగా ఎంత రీచార్జి చేసుకుంటే అంతవరకే కరెంట్ ఇవ్వడం, ఆపై కట్ చేయడం చేస్తే ఎవరికైనా ఇబ్బందే కదా. ఒక్కొక్క నెలలో దుకాణంలో వ్యాపారం తగ్గుముఖం పడితే డబ్బులున్నప్పుడు పెనాల్టీ కట్టి అయినా కరెంట్ బిల్లు కట్టే వెసలుబాటుంటుంది. కానీ ఇప్పుడు ముందుగానే కట్టాలంటే కుదిరేపనేనా.?

– సుభాన్, హోటల్ యజమాని, పలమనేరు

అన్ని కేటగిరిలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నాం. వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు ఏర్పాటు చేస్తాం. ఆపై గృహాలు, మళ్లీ రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తాం. ముందుగానే డబ్బు చెల్లించడంతో పెండింగ్ బకాయిల సమస్య తగ్గుతుంది.

– శ్రీనివాసమూర్తి, డీఈ, ట్రాన్స్‌కో, పుంగనూరు

గ్రామీణులు గజగజ


ధ్వంసమైన టమాట పంట

భాకరాపేట : మండలంలోని గ్రామాల ప్రజలు ఏనుగుల వరుస దాడులతో గజ గజ వణుకుతున్నారు. శనివారం అర్ధరాత్రి ఏనుగులు గుంపు మట్లువారిపల్లె సమీపంలోని భయారెడ్డి అనే రైతుకు చెందిన 2 ఎకరాల టమాట తోటను ధ్వంసం చేశాయి. దీంతో సుమారు రూ.10లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అటవీశాఖ అధికారులు పట్టించుకుని ఏనుగులను దారి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

ఏటీఎం ధ్వంసంపై ఫిర్యాదు


పగిలిన ఏటీఎం

చంద్రగిరి : స్థానిక కొత్తపేటలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ఇండియన్ బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేశాడు. వివరాలు.. ఏటీఎం సెంటర్‌లో చొరబడిన ఓ వ్యక్తి పెద్ద రాళ్లతో మిషన్‌పై దాడి చేశాడు. ఈ క్రమంలోనే దుండగుడు తాను గాంధీ అని, తుపాకీతో కాల్చేయండి అంటూ బిగ్గరగా కేకలు వేసినట్లు స్థానికులు వెల్లడించారు. దీంతో ఆ వ్యక్తికి మతిస్థిమితం లేదని భావించి వదిలిపెట్టినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న బ్యాంకు మేనేజర్ జయశ్రీ, చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఏటీఎం సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తి ఆచూకీ కోసం సీసీ కెమరాలను పరిశీలించినట్లు తెలిసింది. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించడం లేదని, దీంతో అసలు సమస్య వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా సెక్యూరిటీ లేని ఓ ఏటీఎంలో భారీ చోరీ జరిగిందని గుర్తు చేస్తున్నారు.

గుంతలో పడి వ్యక్తి మృతి


సుధాకర్ మృతదేహం

కోట: మండలంలోని గోవిందపల్లెలో శనివారం రాత్రి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. రాయపు సుధాకర్ (46) రాత్రి 8గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించగా ఆదివారం ఉదయం గ్రామంలోని మద్యం దుకాణం వెనుక ఓ గుంతో మృతదేహం కనిపించింది. ఒంటిపై గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. అయితే గుంతలో పడిన కారణంగా గాయపడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయ శిలాఫలకాల ధ్వంసం


దుండగులు ధ్వంసం చేసిన నూతన భవన శిలాఫలకం


ధ్వంసమైన మండల పరిషత్ సభ్యుల పేర్లు ఉన్న శిలాఫలకం

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నున్న రెండు శిలాఫలకాలను శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. మండల పరిషత్ కార్యాలయం నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం, మండల పరిషత్ సభ్యుల పేరుతో మరో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ రెండు శిలాఫలకాలను ధ్వంసం చేశారు. గత నెల 15 వ తేదీన 2022 సంవత్సరం డిసెంబరు 1వ తేదీన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో మండల ప్రజాపరిషత్ కార్యాలయము ఆధునీకృత భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలాకాన్ని ధ్వంసం చేశారు. కార్యాలయ ఆవరణలో ఉన్న మూడు శిలాఫలకాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు సిరులతల్లికి సారె సమర్పణ

– చెవిరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పాదయాత్ర

తిరుపతి రూరల్ : పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో ప్రధానమైన గజవాహన సేవను పురస్కరించుకుని సోమవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించనున్నారు. గజవాహన సేవ రోజు ఏటా చెవిరెడ్డి ఆధ్యాత్మిక పాదయాత్ర చేపట్టి అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయం వద్ద సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించనున్నారు. 6.30 గంటలకు గాంధీపురం, 7కి అవిలాల, 7.30కి లింగేశ్వరనగర్, 8కి శ్రీనివాసపురం, 8.30కి పద్మావతిపురం, 9కి తిరుచానూరు, 9.30 గంటలకు పద్మావతి అమ్మవారి ఆలయానికి పాదయాత్ర చేరుకోనుంది.

ఉచిత సేవకుల వేతన వెతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో 8 ఏళ్లుగా పనిచేస్తున్న 18మంది ఉచిత సేవకులు వేతన కోసం నానా అవస్థలు పడుతున్నారు. దేవదాయశాఖ కమిషనర్ ఆర్డర్ ఉన్నప్పటికీ తమకు జీతాలు చెల్లించడం లేదని కోర్టును ఆశ్రయించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారి సేవలను గుర్తించి ఉత్సవ సమయాల్లో వినియోగించుకుని జీతాలు ఇవ్వాలని ప్రపోజల్ పంపించారు. ఆలయ అప్పటి పాలకమండలి ఆమోదంతో గురుదక్షిణామూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట 18మందికి ఉత్సవాల సమయంలో దివిటీలు పట్టుకునేందుకు, క్యూల నియంత్రణకు ఉచిత సేవకులను వినియోగించుకుంటామని ప్రతిపాదనలు పంపించారు. కమిషనర్ సైతం ఈమేరకు వారికి జీతాలు ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ఉత్తర్వులు అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత సేవకులకు వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి 6 నెలలుగా వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారు.ఈ క్రమంలో మొత్తం 18 మంది ఉచిత సేవకులు తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. కనీసం ఆలయ ఈఓను కలిసేందుకు కూడా అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలమైన తమకు జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నారు. ఈ క్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా గ్రీవెన్స్‌కు హాజరుకావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అయితే కలెక్టర్ మాత్రం సూళ్లూరుపేట ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌కు హాజరుకానున్నారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

శ్రీకాళహస్తి: మండలంలోని రాచగున్నేరి వద్ద ఓ ఫ్యాక్టరీలో జార్ఖండ్‌కు చెందిన సరాజ్ (21) అనే కూలీ ఆదివారం మృతి చెందాడు. విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి కార్మికుడు మరణించినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది. సరాజ్ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష కేంద్రం.. పక్షపాతం!

- ఎస్వీయూ పరిధిలో 4 నుంచి డిగ్రీ సెమిస్టర్ ప్రారంభం
- ఎగ్జామ్ సెంటర్ కేటాయింపులపై ఆరోపణలు
- వర్సిటీ అధికారుల తీరుపై విమర్శలు


ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ నెల 4 నుంచి 28వ తేదీ వరకు డిగ్రీ కోర్సులకు సంబంధించి మూడు, ఐదో సెమిస్టర్ ప్రారంభం కానుంది. మూడో సెమిస్టర్‌కు 5,250 మంది, ఐదో సెమిస్టర్‌కు 6,127 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల కేటాయింపు ప్రక్రియపై గందరగోళం నెలకొంది. మౌలిక వసతులు పక్కాగా ఉన్న కళాశాలలకు కూడా ఎగ్జామ్ సెంటర్ ఇవ్వలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు సెంటర్ల సంఖ్యను సైతం తగ్గించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయకారణాలతోనే ఎగ్జామ్ సెంటర్ల మార్పులు, కుదింపులు చేపట్టారని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా 84 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 64 సెంటర్లకు తగ్గించినట్లు తెలుస్తోంది.

విమర్శల వెల్లువ

ఉమ్మడి జిల్లాలో గత 10 ఏళ్లుగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎగ్జామ్ సెంటర్‌లకు సైతం ఈ పర్యాయం అనుమతులు ఇవ్వకపోవడం దారుణమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. పక్షపాత ధోరణితో సామాజిక వర్గ సమీకరణాలు, అధికారపార్టీకి అండగా ఉన్న కళాశాలలకు మాత్రమే సెంటర్లు కేటాయించారని విమర్శిస్తున్నాయి. అన్ని వసతులు, ఏర్పాట్లు కలిగిన కళాశాలలకు మొండిచెయ్యి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎటువంటి తనిఖీలు నిర్వహించకుండా వసతులు లేని కళాశాలలకు అనుమతులు కేటాయించడం సమంజసం కాదని వాపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కేటాయిస్తే న్యాయపోరాటం తప్పదని హెచ్చరిస్తున్నాయి. పరీక్ష కేంద్రాలను కుదించడంతో సుదూర ప్రాంతాల విద్యార్థులు అవస్థలు తప్పవని, ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలని సూచిస్తున్నాయి.

వ్యయం తగ్గించేందుకే..

గతంలో ఉన్న పరీక్ష కేంద్రాలలో 20 సెంటర్లను తగ్గించాం. పరీక్షల నిర్వహణకు పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వ్యయం తగ్గించేందుకే సెంటర్లను కుదించాం. కేటాయించిన ఎగ్జామ్ సెంటర్లలో మౌలిక వసతులపై ఆరా తీసిన తర్వాతే అనుమతులు ఇచ్చాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. సెంటర్ కేటాయింపులపై వస్తున్న ఆరోపణలు సత్యదూరం.

– అప్పారావు, వీసీ, ఎస్వీయూ

విద్యుత్ శాఖకు 'ఫెంగల్' షాక్


శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎంఎంగుంటలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


తిరుపతి రూరల్‌లో ఒరిగిన విద్యుత్ స్తంభం

- దెబ్బతిన్న 138 స్తంభాలు, 20 కిలోమీటర్ల లైన్, 68 ట్రాన్స్‌ఫార్మర్లు
- తిరుపతి సర్కిల్‌లో సుమారు రూ.70 లక్షల నష్టం

తిరుపతి రూరల్ : ఫెంగల్ తుపాను విద్యుత్‌శాఖకు భారీగా షాక్ ఇచ్చింది. ఈదురు గాలులకు తోడు జోరుగా కురిసిన వర్షంతో తిరుపతి సర్కిల్ పరిధిలో రూ.70 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం ఈ మేరకు నాయుడుపేట, తిరుపతి రూరల్ డివిజన్ల పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను ఆయన పరిశీలించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ తిరుపతి రూరల్, పుత్తూరు, నాయుడుపేట డివిజన్ల పరిధిలో నష్టం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 138 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, 11కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లు 20.5 కిలోమీటర్ల మేర ధ్వంసమయ్యాయని, 68 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు వివరించారు. విద్యుత్ నిలిచిపోయిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా యుద్ధప్రతిపాదికన సరఫరాను పునరుద్ధిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం సాయంత్రానికి 98 శాతం సరఫరాను పునరుద్ధించామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.